ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఇ.ఓ.) అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఏ.ఇ.ఓ) ఇద్దరూ కలసి గత ఏడాదిగా పనిచేస్తున్నారు. వాళ్లిద్దరి మధ్యా ఏ విషయంలోనూ అభిప్రాయభేదం లేదు.



కానీ స్టెనోగ్రాఫర్ నియామకంలోనే మొదటి సారిగా ఇద్దరిమధ్యా ఏకాభిప్రాయం కుదరలేదు.

ప్రస్తుతం పనిచేస్తున్న స్టెనోగ్రాఫర్‌కి వేరే ఉద్యోగం రావడంతో ఆ పోస్టులో ఖాళీ ఏర్పడింది. ఆఫీసులో ఇ.ఓ కన్నా ఏ.ఇ.ఓయే ఎక్కువ డిక్టేషనిస్తాడు. స్టెనోగ్రాఫర్ అవసరం ఇ.ఓ కన్నా ఏ.ఇ.ఓకే ఎక్కువ. అందుకే ఆ ఖాళీని భర్తీ చేసేందుకు పూర్తిగా ఏ.ఇ.ఓకే అధికారాలిచ్చాడు ఇ.ఓ.

ఎంతోమంది షార్ట్ హ్యాండు పాసైన అభ్యర్థులు ఇంటర్వ్యూకి వచ్చారు. కొందరు ఏ.ఇ.ఓ వేసిన ప్రశ్నలకే సమాధానం చెప్పలేక తిరిగి వెళ్లిపోయారు. ఏ.ఇ.ఓ ఇచ్చిన డిక్టేషన్ రాయలేక ''సారీ సర్'' అని మధ్యలోనే కొంతమంది వెళ్లిపోయారు.

చివరికి సీత, గీత మిగిలారు. ఆ ఇద్దరూ టైప్ చేసిన కాగితాలు తీసుకుని ఇ.ఓ. దగ్గరకెళ్లాడు ఏ.ఇ.ఓ.

ఆ రెంటినీ పరిశీలించి, ''ఓకే, గీత బాగా టైప్ చేసింది. తప్పులు కూడా ఎక్కువగా లేవు. మీ స్వీడుకీ, భాషకీ తట్టుకోగలదు. గీతని నియమిస్తే సరి'' అన్నాడు ఇ.ఓ.

''కాదు సార్! భవిష్యత్తులో సీత బాగా అభివృద్ధి చెందే అవకాశముంది. సీతని నియమించండి సార్'' అన్నాడు ఏ.ఇ.ఓ.

అ మాటతో ఆశ్చర్యపడ్డాడు ఇ.ఓ.

ఎప్పుడూ ప్రతిభకే పట్టంకట్టే ఏ.ఇ.ఓ ఈసారి ప్రతిభమ ప్రక్కకు నెట్టడంలో అతని ఆంతర్యమేమిటో ఇ.ఓకి తెలియలేదు. ఎందుకైనా మంచిదని ఇ.ఓ కూడా డిక్టేషనిచ్చాడు. అప్పుడు కూడా సీత కన్నా గీత బాగా టైప్ చేసింది. కానీ ఏ.ఇ.ఓ పట్టు వదలటల్లేదు. ఏ.ఇ.ఓ మాట కాదనడం ఇ.ఓకి ఇష్టం లేదు. అలాంటి సమయాల్లో మేనేజర్ని సంప్రదించడం మంచిదనిపించింది.

మేనేజర్ కూడా ప్రతిభకే పట్టంకట్టే మనిషి. అందుకే మేనేజర్ని పిలిచి ఆ రెండు కాగితాలను ఆయన చేతికిచ్చి, ''మీరు జాగ్రత్తగా పరిశీలించి మీ అభిప్రాయాన్ని తెలియజేయండి'' అన్నాడు ఇ.ఓ.

అన్ని విషయాలు పరిశీలించి ఓ గంట తర్వాత ఇ.ఓ దగ్గరకొచ్చాడు మేనేజర్.

''సార్! గీత బాగా టైప్ చేసింది. కానీ సీతని నియమిస్తే మంచిది'' ఇ.ఓ ఆశ్చర్యంగా డేలా అన్నాడు మేనేజర్.

''మీరు కూడా అలా అంటున్నారేమిటండీ?'' అన్నాడు ఇ.ఓ.

''గీతని నియమిస్తే మన ఏ.ఇ.ఓ గారి రాత మారిపోతుంది'' అన్నాడు మేనేజర్.

''ఎందుకని?''

''మన ఏ.ఇ.ఓగారి భాషకీ, స్పీడుకీ గీత తట్టుకోగలదు. కానీ ఆమె చప్పిచవడలు, డొల్లముక్కు, మసిబొగ్గు రంగు చూస్తే మన ఏ.ఇ.ఓగారి భాషకీ, స్పీడుకీ బ్రేకునిస్తుంది. కానీ సీత విశాలమైన కళ్లు, చిరునవ్వు చూస్తూ స్టెనోగ్రాఫర్ కంటే స్పీడుగా మన ఏ.ఇ.ఓ గారే స్కైల్ని రాయగలరు. అందుకని సీతనే నియమించండి'' అన్నాడు మేనేజర్.

-సి.నాగరాజారావు (రాజమండ్రి)